
గణితశాస్త్ర దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా గణితశాస్త్ర దినోత్సవం

సరూర్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లెలగూడలోని లార్డ్స్ స్కూల్‌లో గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ గణితశాస్త్రం సులభతరమైన సబ్జెక్టు అని, విద్యార్థులు గణితం అనగానే భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఒక్కసారి అర్థం చేసుకుంటే జీవితాంతం గుర్తుండిపోయేది ఒక్క లెక్కలు(గణితం) మాత్రమేనని వారు పేర్కొన్నారు. విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని గణితంపై పట్టుసాధించాలని వారు సూచించారు. ఉత్సవంలో భాగంగా గణితంతో ముడివడి ఉన్న పలు మోడళ్లను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీశ్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇన్‌చార్జి రేఖాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 21వ డివిజన్‌లోని భీష్మనగర్ కాలనీలో దాదాపు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మంగళవారం కార్పొరేటర్ బంగారి అనితాప్రభాకర్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లోని అంతర్గత రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


వ్యాస రచన పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న టీజీఆర్‌ఈడీసీఓ ప్రతినిధులు

ఇంధన పొదుపుపై వ్యాస రచన పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీఆర్‌ఈడీసీవో) ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపుపై గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంధన పొదుపు, దానితో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. స్కూల్ హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంధన పొదుపుతో డబ్బు ఆదాతో పాటు ప్రజారోగ్యాని కాపాడుకోగలుగుతామన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటనవీన్‌కుమార్, సుధాకర్, స్వేత, రమేష్‌కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

● జడ్సీకి కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి

కొత్తపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని, తగిన నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. మంగళవారం ఆయన జడ్సీని కలిసి కాలనీల్లో రహదారులు పాడైన ప్రాంతాల్లో సీసీ రోడ్డు వేయాలని, నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, కాలనీల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయనతో పాటు కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

మహాధర్నాకు తరలిన జీపీ ఉద్యోగులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల డిమాండ్ల సాధనకై తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా పార్కు వద్ద మంగళవారం నిర్వహించిన మహాధర్నాకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నుంచి పెద్ద ఎత్తున కార్మికులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ఉప్పు రాములు, కె.పెంటయ్య, ఎం.ఉపేందర్, డి.సురేంద్రపాల్, బాలరాజు, యాదగిరి, కుమార్, శ్రీశైలం, భార్గవ్, శ్రావణ్, జంగయ్యతో పాటు పలువురు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి హతమార్చిన ఘటనలో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమాన విధిస్తు రంగారెడ్డి జిల్లా స్పెషల్ రేప్, పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. పీపీ బర్ల సునీత కథనం ప్రకారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2014లో ఓ బాలికను వెంకటేష్(33) అనే వ్యక్తి ప్రకాశం జిల్లాలో కిడ్నాప్ చేయడంతో పాటు అత్యాచారం చేసి హతమార్చాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కిడ్నాప్‌కు గురైన బాలికను అత్యాచారం చేసి హతమార్చినట్లు తేల్చిన పోలీసులు నిందితుడిపై పలు సెక్షన్లకింద కేసు నమోదు చేసి ఆధారాలతో కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు. కేసులో సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పద్మావతి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.13 వేలు జరిమానా విధిస్తు తీర్పు చెప్పారు.

జిల్లెలగూడలో చైన్ స్నాచింగ్

సరూర్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమారుడితో కలిసి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడలోని జనార్దన్‌రెడ్డినగర్ కాలనీకి చెందిన కొర్ర హరిత(32) సోమవారం సాయంత్రం న్యూగాయత్రీనగర్ కాలనీలోని స్కూల్ నుంచి తన కుమారుడిని తీసుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. అదే సమయంలో వెనుక నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన దుండగుడు రెప్పపాటులో ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు మంగళసూత్రం తెంచుకుని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

స్వచ్ఛ లక్ష్యం..

మాటలకే పరిమితం

● దుర్గంధంగా మార్కెట్ పరిసరాలు
● పట్టించుకోని మార్కెటింగ్ శాఖ, పాలకవర్గం
● మాదన్నపేట మండిలో పడకేసిన పారిశుధ్యం


షెడ్‌లలో కుళ్లిన వ్యర్థాలు

సైదాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్ దుస్థితిని చూస్తే అమ్మో అనాల్సిందే. మార్కెట్ ఆవరణలో బురద, పేరుకుపోయిన చెత్తకుప్పలు, కుళ్లిన వ్యర్థాలతో దుర్గంధంగా మారింది, పరిస్థితి దారుణంగా ఉన్నా అధికారులు, పాలకవర్గం పట్టించుకున్న పాపానా పోలేదు. నిత్యం రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో బిజీగా ఉండే ఈ మార్కెట్లో ఎక్కడా చూసినా చెత్తచెదారం గుట్టలుగా పేరుకుపోయి మురికికూపంగా మారింది, మార్కెట్‌లో దోమలు వృద్ధిచెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సమస్యను పలుమార్లు రైతులు, వ్యాపారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నూతన పాలకవర్గంతోనైనా పారిశుధ్య సమస్య పరిష్కారమవుతుందని ఆశించిన రైతులు, వ్యాపారులకు నిరాశే మిగిలింది, పాలకవర్గ ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి మార్కెట్ వైపు


మార్కెట్‌లో బురదమయంగా రోడ్లు

వచ్చినా పాపానా పోలేదంటే వారి చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మార్కెట్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకుప్పలు

కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి

● తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు

హయత్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాగ్ హయత్‌నగర్‌లోని సర్వే నంబర్ 207లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురి అవుతుందని దానిని కాపాడాలని కోరుతూ మంగళవారం ప్రియదర్శిని కాలనీ ఫేజ్-2 కాలనీ వాసులు హయత్‌నగర్ తహసీల్దార్ జానకిని కలిసి ఫిర్యాదు చేశారు. ఏలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి చర్చి పేరుతో అడ్డగోలుగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నాడని తెలిపారు. గతంలో రెవిన్యూ అధికారులు సదరు నిర్మాణాన్ని కూల్చి వేసినా తిరిగి మళ్లీ ఆక్రమిస్తున్నాని తెలిపారు. ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు లేకున్న దర్జాగా ఆక్రమిస్తున్నాడని తెలిపారు. వెంటనే సదరు నిర్మాణాన్ని పరిశీలించి తొలగించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ముస్కు సత్తిరెడ్డి, చింతల రఘుపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేష్ యాదవ్, జగన్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాసరావు, అరవింద్‌రెడ్డిలు ఉన్నారు.


ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మంగళవారం హయత్‌నగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

కొత్తపేట/ఎల్బీనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాహదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠన చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఎల్బీనగర్-దిల్‌సుఖ్‌నగర్ దారిలో మంగళవారం ఇద్దరు రైడర్లు విపరీతంగా శబ్దం వచ్చేలా బుల్లెట్ బైకుల సైలెన్సర్స్ మార్చేసి బైకులను వేగంగా ప్రమాదకరంగా నడుపుతూ ప్రయాణికులను, ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు శబ్దకాలుష్యం చేశారు. కొత్తపేట చౌరస్తా వద్ద వారిని పట్టుకుని బైకుల సైలెన్సర్లను మెకానిక్‌ల సహకారంతో తొలగించి, స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించడంతో ఆ రైడర్లకు జరిమానాలు విధించారు. అదనపు సీఐ నాగరాజు, ఎస్‌ఐ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


బుల్లెట్ బైకుల సైలెన్సర్లు స్వాధీనం చేసుకుంటున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

అవగాహనతో ప్రమాదాల నివారణ

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతో ప్రమాదరహిత వాహన ప్రయాణం సాధ్యమేనని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. మంగళవారం హయత్‌నగర్ శ్రీచైతన్య స్కూల్ నుంచి 48 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఆవరణలో టీటీఐ సిబ్బంది సైనేజీ బోర్డుల్లో నిబంధనల చిత్రాలను, కామెంట్స్ చూపించారు. వాహనాల ప్రయాణంలో రోడ్స్ సైన్స్ /గుర్తులను, పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. యానిమేషన్ చిత్రాల ద్వారా వాహనాలు నడపడంలో జాగ్రత్తలనూ వివరించారు.

నిబంధనలు సులభంగా అర్థ మయ్యేలా తయారుచేసిన రైమ్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అర్జున్ మాట్లాడుతూ నిబంధనలను ఎప్పుడూ ఉల్లంఘించరాదని, ప్రయాణాల వళ పెద్దలకూ నిబంధనలను గుర్తు చేయాలన్నారు. బైకులు, సైకిళ్లు నడిపే వారు కూడా రోడ్ సైన్స్‌ను చూస్తూ నిబంధనలను పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో టీటీఐ ఎఎస్ఐ సోమ్‌నాథ్, రామారావు, సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై తయారుచేసిన రైమ్స్‌ను చూస్తున్న విద్యార్థులు

మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోండి

● జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమాలకు సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్ మంగళవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడ అదనపు కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏఓ సునీల్‌నాతానికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారుల ఆదేశాలు ఉన్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. అక్రమాలకు పాల్పడుతున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణ జరిగి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు రవీంద్రాచారి తదితరులు



బడంగ్‌పేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రాంరెడ్డి, అర్జున్ తదితరులు


జిల్లెలగూడలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, కామేశ్‌రెడ్డి తదితరులు

లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి

● రైతుల చేతులకు సంకెళ్లు వేయడం ప్రజా పాలనా?
● బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంరెడ్డి ధ్వజం

సరూర్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మా విలేజ్ కోసం సేకరించతలపెట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన లగచర్ల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అకారణంగా అరెస్టు చేసి జైలుకు పంపించిందని, వారిని బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పలుపు మేరకు మంగళవారం బడంగ్‌పేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

● లగచర్ల రైతుల అరెస్టు, రైతు చేతికి సంకెళ్లు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన సంఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పలుపు మేరకు మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డిల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుశీలరెడ్డి, గోపాల్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

తైక్వాండో పోటీల్లో కిడ్జీ విద్యార్థుల సత్తా

మన్సూరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్కూల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో మన్సూరాబాద్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీలోని కిడ్జీ ప్రీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ నెల 15న నాచారంలోని డీపీఎస్ స్కూల్‌లో జరిగిన కరాటే పోటీల్లో కిడ్జీకి చెందిన 10 మంది విద్యార్థుల్లో ఇద్దరు స్వర్ణం, మరో ఇద్దరు రజితం, ఆరుగురు కాంస్య పతకాలు సాధించి తమ సత్తాను చాటారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కిడ్జీ ప్రీస్కూల్ డైరెక్టర్ మోచెర్ల కల్యాణ్, ప్రిన్సిపాల్ మోచెర్ల శిరీషలు విద్యార్థులతో పాటు తైక్వాండో శిక్షకుడు గణేష్‌ను అభినందించారు.


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆదిమవాసి ఎరుకల సొసైటీ కార్యవర్గం ఎన్నిక

సైదాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదిమవాసి ఎరుకల కో-ఆపరేటివ్ సొసైటీ ఏకలవ్య నగర్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సైదాబాద్ ఏకలవ్యనగర్ ప్లే గ్రౌండ్ లో సహకార సంస్థ అధికారులు అసీముద్దీన్, వెంకటేష్‌గౌడ్, అజీం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ఎం.యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా బదనాపురం రఘు, కోశాధికారిగా క్రాంతి కుమార్, ఉపాధ్యక్షుడిగా పుడుత రవిందర్, కమిటీ సభ్యులుగా పి.యాదయ్య, మల్లేష్, యాదయ్య, విజయ్, లక్ష్మణ్, రాజు, నర్సింగ్, రాజు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో న్యాయవాది మహేష్, న్యాయవాది సుదర్శన్ పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

మన్సూరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ది హైదరాబాద్ ఆటోనగర్ మెకానిక్ అండ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఆటోనగర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. నూతన కమిటీ చైర్మన్‌గా ఎస్‌డీ సలీమ్, వైస్ చైర్మన్‌గా యు.లక్ష్మణ్, గౌరవ సలహాదారుగా బాబన్న, అధ్యక్షుడిగా కె.కృష్ణ, కోశాధికారులుగా కె.సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, పి.దుర్గరామ్, ఆర్.శ్రీనివాసచారి, ఉపాధ్యక్షులుగా ఎస్.రామాంజనేయులు, బి.బ్రహ్మాచారి, సీహెచ్ నాగరాజు, డి.జగదీష్, సంయుక్త కార్యదర్శులుగా జి.నర్సింహరావు, ఎం.బాలకృష్ణ, బి.నరసింహ, డి.ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.అజయ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆటోనగర్‌లోని మెకానిక్‌లు, టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజలను ఇబ్బందిపెడుతున్న ట్రాన్స్‌జెండర్లపై కేసు

వనస్థలిపురం, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న నలుగురు ట్రాన్స్‌జెండర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగార్జునసాగర్ జాతీయ రహదారి విపస్యన ధ్యాన కేంద్రం సమీపంలో ట్రాన్స్‌జెండర్స్ రాత్రి సమయంలో రోడ్డుపై నిలబడి అటుగా వెళ్తున్న వారిని అకట్టుకునే విధంగా వ్యవహరిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం రాత్రి నలుగురిని అదుపులోకి తీసుకుని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని ఇద్దరు వృద్ధుల మృతి



వనస్థలిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఇద్దరు వృద్ధులు మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం వనస్థలిపురం సచివాలయనగర్ కాలనీ బస్టాప్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు(60), స్వామినారాయణ కాలనీలో గుర్తుతెలియని వృద్ధుడు(80) చనిపోయి ఉన్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తుల ఆచూకీ తెలిసిన వారు 8712662300, 8712662637, 8712662277 ఫోన్ నంబర్లను సంప్రదించాలనీ పోలీసులు తెలిపారు.


మంటల్లో కాలి బుడిదయిన

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

● రూ. 40 లక్షల ఆస్తినష్టం

ఎల్బీనగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగి దాదాపు రూ. 40 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఆర్‌కేపురం గ్రీన్‌హిల్ కాలనీలోని ఖిల్లా మైసమ్మ దేవాలయం వెనుక భాగంలో రోహిణి విల్లా-1లోని పై అంతస్తులో మంటలు అంటుకుని రెండు గదులలో ఫర్నిచర్, టీవీ పూర్తిగా దగ్ధమైంది. డాక్టర్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్ శ్రీనిధిలు గమనించి వెంటనే నాగోల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు.